క్లుప్తంగా

నేడు మండల సమావేశం

శంఖవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జె.రాంబాబు సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్, ఎంపీపీ పర్వత రాజుబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: మండలంలోని డ్వాక్రా మహిళలకు మంగళవారం సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి దాడిశెట్టి రాజా మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు తెలిపారు. ఈ మేరకు స్థానిక గొంపకొండ ప్రాంతంలో సభావేదికను సిద్ధం చేస్తున్నారు. కాగా సోమవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, పార్టీ తుని పట్టణాధ్యక్షుడు రేలంగి రమణా గౌడ్, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీహరిరాజు సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆసరా లబ్ధిదారులు పాల్గొనాలని ఎంపీపీ కోరారు. సర్పంచ్ జిగటాల వీరబాబు, కోఆప్షన్ మెంబర్ జిగటాల కోట సత్తిబాబు, వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, పెద్దిర్సి రమేష్ పాల్గొన్నారు.

రేపు ఆసరా చెక్కుల పంపిణీ

తొండంగి: మండలంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు బుధవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ పసపులేటి సతీష్ తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి సోమవారం పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళులు



ఏలేశ్వరంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

ఏలేశ్వరం: ఛత్రపతి శివాజీ వర్ధంతిని పట్టణంలో సోమవారం నిర్వహించారు. స్థానిక మార్స్ కంప్యూటర్స్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మండలశాఖ అధ్యక్షుడు అలమండ దుర్గావెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ గొప్ప పోరాటయోధుడన్నారు. ఓటమి ఎరుగని ధీరుడిగా ప్రపంచంలో ప్రత్యేకస్థానం పొందారన్నారు. విద్యార్థులు శివాజీ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కటకం కిరీటీ, తూము రౌతు గురయ్య, కోరాడ రాజు, నార్ని గంగ, వుడతల రమణారావు, కందుల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో చోరీ

తొండంగి: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న చర్చిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్చి పాస్టర్ యు.దివాకర్ కూటమి (ప్రార్థన) నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని మరో ప్రాంతానికి వెళ్లారు. రాత్రి సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో వెనుక ప్రాంతం నుంచి గుర్తు తెలియని దుండుగులు చర్చిలోకి ప్రవేశించి కానుకల హుండీని దోచుకెళ్లారు. హుండీలో సుమారు రూ.30 వేల నగదు ఉంటుందని అంచనా. దీనిపై పాస్టర్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక హాయిగా.. వేగంగా..

- చివరి దశకు చేరిన హైవే విస్తరణ పనులు
- గోకవరం నుంచి బూరుగుపూడి గేటు వరకు రహదారి విస్తరణ
- 99 శాతం పనులు పూర్తి
- ఆనందం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



గోకవరంలో పది మీటర్ల మేర విస్తరించిన జాతీయ రహదారి



గోకవరం శివారున జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

గోకవరం: గోకవరం నుంచి బూరుగుపూడి గేటు వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ ఉన్న 516–ఇ జాతీయ రహదారి పరిధిలోని గోకవరం శివారు నుంచి కోరుకొండ మండలంలోని బూరుగుపూడి గేటు వరకు సుమారు 11.2 కిలో మీటర్ల మేర రహదారి విస్తరణకు గతేడాది జనవరిలో రూ.65 కోట్లు నిధులు మంజూరయ్యాయి. గతంలో ఉన్న ఉన్న రహదారిని పది మీటర్ల వరకు వెడల్పు చేసేందుకు గతేడాది ఫిబ్రవరి నెలలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు 99 శాతం పూర్తయ్యాయి. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇక్కట్లు

గోకవరం నుంచి కోరుకొండ వరకూ గతంలో 5.5 మీటర్లు వెడల్పు గల రోడ్డు ఉండేది. రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్‌కు నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగించేవి. రహదారి ఇరుకుగా ఉండటంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనికి తోడు పలు చోట్ల రహదారి పూర్తిగా ఛిద్రం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ క్రమంలో గతేడాది రూ.65 కోట్లు నిధులతో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు దాదాపు పూర్తయ్యాయి. గోకవరం శివారున దేవీపట్నం ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో ఇరుకుగా ఉన్న వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.60 లక్షలతో ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలో ఈ పనులు కూడా పూర్తికానున్నాయి.



రహదారి చెంత ప్రయాణికుల కోసం నిర్మించిన షెడ్డు

షెడ్ల నిర్మాణం

ఈ మార్గంలో ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా షెడ్లు సైతం నిర్మించారు. ప్రమాదకరమైన మలుపులు, కాలువల వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేశారు. గతంలో ఈ మార్గంలో రాకపోకలకు పలు ఇబ్బందులు పడేవారమని, రహదారి విస్తరణతో ప్రయాణం సురక్షితంగా, సుఖవంతంగా మారిందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

> **పనులు దాదాపు పూర్తి**
>
> గోకవరం నుంచి బూరుగుపూడి గేటు వరకూ నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ మార్గంలో పలు చోట్ల ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేశాం. అక్కడక్కడా రోడ్డు సేఫ్టీ పనులు చేయాల్సి ఉంది. గోకవరం శివారున వంతెన వెడల్పునకు అనుమతి రావడంతో ప్రస్తుతం ఆ పనులు వేగంగా నిర్వహిస్తున్నాం.
>
> – శ్రీనివాస్, ఆర్అండ్‌బీ జేఈ, రాజమహేంద్రవరం

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ర్యాలీ



ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అయర్లా కార్యకర్తలు

ప్రత్తిపాడు: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రత్తిపాడులో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయర్లా) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ ర్యాలీ చేసి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ నోటితో పిలిచి నొసటితో వెక్కిరించినట్టుగా కేంద్ర ప్రభుత్వం తీరు ఉందన్నారు. ఉపాధి హామీ పథకంలో సరికొత్త ఆంక్షలు, నిబంధనలు విధించి కూలీలే తమకు తాముగా వంద రోజుల పనికి రాకుండా చేయాలని చూస్తోందన్నారు. ఒకే పంచాయతీలో 20కి మించి ఉపాధి పనులు చేయరాదన్న నియమం వల్ల ఎక్కువ కూలీలు ఉండే మేజర్ పంచాయతీలు, ఆవాస గ్రామాలు ఎక్కువగా ఉండే ఆదివాసీ పంచాయతీల్లో కార్మికులు నష్టపోతున్నారన్నారు. కేంద్రం నిత్యావసర వస్తువుల ధరలను భారీగా పెంచి పేదల నడ్డి విరుస్తోందన్నారు. పని హక్కును సాధిద్దాం–ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి కె.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లిబరేషన్ అనుబంధ సంస్థల జిల్లా నాయకులు రేచుకట్ల సింహాచలం, తాడి నాగేశ్వరరావు, చిన్నం అచ్చిరాజు, రాజాల రత్నం, దుమ్ముల దేవి, పల్లా లక్ష్మి, తిరగటి నాగమణి, కాదా సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



ప్రత్తిపాడు కోర్టులో న్యాయమూర్తి కాటం భానుకు వినతిపత్రం అందజేస్తున్న బార్ ప్రతినిధులు

ప్రత్తిపాడు: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు బుగత శివ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో న్యాయవాది హత్య, రాజమహేంద్రవరంలో న్యాయవాదిపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఇటీవల న్యాయవాదులపై దాడులు మితిమీరాయన్నారు. కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణకు చట్టం తేవాలని, న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని న్యాయమూర్తి కాటం భానుకు అందజేశారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు ఆడారి సుగుణ, కుక్కుటేశ్వరరావు, ఆర్‌వీ వెంకట్రావు, రాయి శ్రీనివాసరావు, జి.సుబ్రహ్మణ్యం, అవసరాల దేవి, పోతుల జోగేష్, మల్లేశ్వరరావు, ఆకుల హరిబాబు, అత్యుత రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం



ప్రత్తిపాడు దేవులపల్లి వారి చెరువులో పూడికతీత పనులను ప్రారంభించిన ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: స్థానిక దేవులపల్లివారి చెరువులో పూడిక తీత పనులను సోమవారం ప్రారంభించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఈ పనులను ఎంపీపీ గొళ్ల కాంతి సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. చేసిన పనికి కచ్చితంగా కొలతలు నమోదు చేసి, వేతనదారులు నష్టపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఉపాధి ఏపీఓ ఏబీవీ నాయుడు, ఎంపీటీసీ సేంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు పత్రి రమణ, పార్టీ నాయకులు ఆకుల వీరబాబు, చెలంకూరి రాజబాబు, పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ

గోకవరం: కల్తీమాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం పశుసంవర్ధక శాఖ డీడీ కె.సత్యనారాయణ హెచ్చరించారు. గోకవరంలో కల్తీమాంసం విక్రయాలను అరికట్టాలని గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం ఆయన గోకవరంలో మాంసం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాంసం విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అధికారుల పర్యవేక్షణలో విక్రయాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అన్ని రకాల మాంసం విక్రయాలు ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివలన ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇకపై గోకవరంలో విక్రయించే మేక మాంసంపై కచ్చితంగా సీలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కల్తీ మాంసం విక్రయించినట్టు ఫిర్యాదులు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు గోకవరంలో మాంసం దుకాణాల వద అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని, దీనివలన ప్రజలు పలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి కేటాయించిన స్థలాల్లో మాంసం విక్రయాలు నిర్వహించుకునే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రం వద్ద పేపరుపై చర్చించుకుంటున్న విద్యార్థులు



గండేపల్లిలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ఏలేశ్వరం: పదో తరగతి పరీక్షలు సోమవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలను 8.30 గంటలకే చేరుకున్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహించారు.ఏలేశ్వరంలో మూడు, లింగంపర్తి ఒకటి పరీక్ష కేంద్రాల్లో 861 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజర్ కాగా 856 మంది పరీక్షలు రాశారు. ఏలేశ్వరంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాష్యం స్కూల్, లింగంపర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. దూర ప్రాంత విద్యార్థులకు హాల్ టికెట్లు చూపిస్తే ఉచితంగా ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పించింది.

తుని: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులను కల్పించారు. ప్రతి సెంటర్లోనూ లైట్లు, ఫ్యాన్లు, మంచినీరు, ఆరోగ్య మిత్రాలను ఏర్పాటు చేశామని ఎంఈవో పరవాడ గీతాదేవి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ రాజా ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సీతారాంపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, సిద్ధార్థ, శ్రీప్రకాష్, లయోలా, భాష్యం స్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 1500 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పోలీసులను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆర్టీసీ ఉచితంగా బస్సుల్లోకి అనుమతిచ్చింది. విద్యాశాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

గండేపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 521 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. గండేపల్లి పరీక్ష కేంద్రంలో 160 మంది విద్యార్థులకు గాను 159 మంది, మల్లేపల్లిలో 154 మందికి 148 మంది, తాళ్లూరులో 175కి గాను 174 మంది విద్యార్థులు పరీక్షలు హాజరైనట్టు అధికారులు తెలిపారు.

తొలిరోజు పరీక్షకు 9 మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్లో 190 మందికి 189 మంది, ధర్మవరం జెడ్పీ హైస్కూల్లో 166 మందికి 161 మంది, లంపకలోవ హైస్కూల్లో 256 మందికి 253 మంది హాజరుకాగా ఒమ్మంగి హైస్కూల్ ఎ సెంటర్లో 184 మంది, ఒమ్మంగి బి సెంటర్లో 150 మంది వెరసి 946 మందికి 937 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్లో పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కోటనందూరు మండలంలో ముగ్గురు గైర్హాజరు

కోటనందూరు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్, మదర్ విద్యానికేతన్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 546 మంది విద్యార్థులకు గాను ముగ్గురు పరీక్షకు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

తొండంగి మండలంలో తొమ్మిది మంది గైర్హాజరు

తొండంగి: మండలంలో పదో తరగతి పరీక్షలకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో షేక్‌బాబ్జీ తెలిపారు. తొండంగి, బెండపూడి, పెరుమాళ్లపురం, దానవాయిపేట జెడ్పీ హైస్కూళ్లలో పరీక్షలు నిర్వహించారు. తొండంగిలో 213 మందికి 210, బెండపూడిలో 146 మందికి 145, పెరుమాళ్లపురంలో 263 మందికి 262, దానవాయిపేటలో 231 మందికి 227 వెరసి 853 మందికి గాను తొమ్మిది మంది గైర్హాజరైనట్టు ఆయన వివరించారు. పెరుమాళ్లపురం, దానవాయిపేట పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

గోకవరం: మండల వ్యాప్తంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 776 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 773 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పలు పరీక్ష కేంద్రాలను ఎంఈఓ బి.గౌరమ్మ తనిఖీ చేశారు.

కిర్లంపూడి మండలంలో ఏడుగురు గైర్హాజరు

కిర్లంపూడి: మండలంలోని పదో తరగతి పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ టి.జోసెఫ్ తెలిపారు. కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు జెడ్పీ హైస్కూల్‌లోని ఎ-సెంటర్‌లో 207 మంది విద్యార్థులకు 205, బి-సెంటర్‌లో 208 మందికి 207, బూరుగుపూడి సెంటర్‌లో 223 మంది విద్యార్థులకు 223, తామరాడ పరీక్ష కేంద్రంలో 269 మంది విద్యార్థులకు 266, ప్రగతి ప్రైవేట్ పాఠశాల పరీక్ష కేంద్రంలో 128 మంది విద్యార్థులకు 127 మంది పరీక్షలకు హాజరు కాగా ఏడుగురు గైర్హాజరైనట్టు ఎంఈఓ జోషఫ్ వివరించారు.

శంఖవరం: మండలవ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మొత్తం 867 మంది విద్యార్థులకు గాను ఆరుగురు పరీక్షలకు గైర్హాజరైనట్టు ఎంఈఓ ఎస్‌వీ రమణ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అన్నవరం ఎస్సై శోభన్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ



తునిలో పది పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



శంఖవరం జెడ్పీ హైస్కూల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పంచాయతీ పాలకవర్గ వార్షికోత్సవం



జగపతినగరంలో సర్పంచ్ శ్రీలతను సత్కరిస్తున్న వార్డు మెంబర్లు

కిర్లంపూడి: పంచాయతీ పాలకవర్గాలు ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం మండలంలోని పలు పంచాయతీల్లో వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. జగపతినగరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత కేక్‌ను కట్ చేసి వార్డు మెంబర్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమెను పంచాయతీ సిబ్బంది, పాలక వర్గ సభ్యులు పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుడాల రాంబాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'కొత్త పరిమళం'



కొత్త పరిమళం నాటికలోని ఓ సన్నివేశం

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లిలో రామాలయం నిర్మించి వందేళ్లు పూర్తి కావడంతో పాటు శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ఆకట్టుకుంటున్నాయి. ఈ పోటీల్లో భాగంగా సోమవారం ప్రదర్శించిన కొత్తపరిమళం నాటిక ఆలోచింపజేసింది. జాతి, మత విద్వేషాలను అంతం చేసి భావితరాలకు మానవత్వపు విశ్వరూప సౌందర్యం అందించడమే ప్రధానాంశంగా ఈ నాటిక సాగింది. బోరిలంక శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటికకు బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించగా కేకేఎల్ స్వామి రచన అందించారు. రెండో పదర్శనగా గుడి ఎనక నాసామి అనే నాటికను ప్రదర్శించారు. దీనికి పి.బాలాజీనాయక్ దర్శకత్వం వహించగా శ్రీస్నిగ్ధ రచన అందించారు.

రబీ వరి కోతలు ప్రారంభం



బెండపూడిలో మెషిన్‌తో వరి కోతలు

తొండంగి: మండలంలోని ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలోని బెండపూడి, కొమ్మనాపల్లి, సీతారాంపురం, ఎ.కొత్తపల్లి, పి.ఇ.చిన్నాయపాలెం, పైడికొండ, పి.అగ్రహారం తదితర గ్రామాల్లో వ్యవసాయ బోర్ల కింద దాదాపుగా రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేశారు. ముందుగా నాట్లు పడటంతో పంట కూడా త్వరగానే పక్వానికి వచ్చింది. రైతులు వరికోత యంత్రాలతో పంటను కోయిస్తున్నారు. మరో పక్క వాతావరణం మేఘావృతమై అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో పంటలను త్వరగా ఒబ్బిడి చేసేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: ఆటోలో సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక పోలీసులు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెదశంకర్లపూడి నుంచి పొన్నాడ ఏసుబాబు మరో వ్యక్తి కలిసి ఆటోలో సారా తరలిస్తున్నారు. స్థానిక జాతీయ రహదారిపై నరేంద్రగిరి సమీపంలో పోలీసులు ఆటోను నిలుపుదల చేసి తనిఖీ చేయగా పది లీటర్ల సారా పట్టుబడింది. ఆటోలో ఉన్న నిందితుడు పరారీ కాగా ఆటో డ్రైవర్ పొన్నాడ ఏసుబాబును అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచారు. ఆటోను, సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పందనకు 12 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. వారం వారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 12 అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. డీఎల్‌డీఓ కేఎన్‌వీ ప్రసాద్, డీఎల్‌పీఓ బాలామణి, సహకార శాఖ నుంచి మసకపల్లి రంగనాయకులు, గృహ నిర్మాణ శాఖ ఈఈ రాజు, ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష, వ్యవసాయ ఏడీఏ దైవకుమార్, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్, ఎంఈఓ సత్యన్నారాయణ, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి పాల్గొన్నారు.